క్లుప్తంగా

నేడు ఎన్‌ఐఆర్‌డీ పీఆర్ బృందం రాక

మన్ననూర్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్‌కు (ఎన్‌ఐఆర్‌డీ, పీఆర్) చెందిన 25 మంది సభ్యుల బృందం బుధవారం సార్లపల్లి గ్రామానికి రానున్నారని అమ్రాబాద్ ఎంపీడీఓ మోహన్‌లాల్ తెలిపారు. హైదరాబాద్ రాజేంద్ర నగర్‌కు చెందిన ఎన్‌ఐఆర్‌డి, పీఆర్ సభ్యులు గిరిజన ఉత్పత్తుల అభివృద్ధి , మార్కెటింగ్ సంస్థాగత మద్దతుపై శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో అవగాహన నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అటవీ ఉత్పత్తులను సేకరించే చెంచులతో ఇష్టాగోష్టితో పాటూ అటవీ ఉత్పత్తుల సేకరణలో మెలకువలు వాటి ద్వార వచ్చే ఆదాయ వనరులు తదితర అంశాల గురించి చర్చించడం జరుగుతుందని వివరించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కల్వకుర్తిరూరల్: బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం హైదరాబాద్‌లో మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారతరాష్ట్ర సమితి విజయం కోసం కృషి చేస్తానన్నారు.

ఉమాపతికి పురోహిత రత్న బిరుదు ప్రదానం



తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన మారోజు ఉమాపతి పురోహితరత్న బిరుదు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం అంతర్జాతీయ స్థాయిలో శాంతికృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ అర్చకపురోహితుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు మరోజు ఉమాపతి ఆచార్యులు వారి దంపతులకు పురోహితరత్న బిరుదుతో సత్కరించారు. సంఖ్యాశాస్త్ర నిపుణులు జ్యోతిష్యులు శ్రీదైవాజ్ఞ శర్మ శాంతికృష్ణ సేవా సమితి అధ్యక్షుడు వంగాల శాంతికృష్ణ ప్రముఖులు శాలువాతో సన్మానించారు.

విద్యార్థిని అనూషకు నివాళి

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని అనూష మంగళవారం మృతిచెందింది. చిన్నంబావి మండలం కొప్పునూరు గ్రామానికి చెందిన అనూష కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విద్యార్థిని చిత్రపటానికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు కళాశాల సిబ్బంది రూ.14 వేలు ఆర్థికసాయం అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, అధ్యాపకులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆర్థికసాయం అందజేత

నాగర్‌కర్నూల్: తెలకపల్లి మండలంలోని గట్టునెల్లికుదురు గ్రామానికి చెందిన పిట్ల ప్రశాంత్ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ మేరకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ గ్రంథాలయ చైర్మన్ హన్మంతరావు, మాజీ జెడ్పీటీసీ నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డీవైఎఫ్‌ఐ గ్రామ కమిటీ ఎన్నిక

కోడేరు: మండలంలోని జనుంపల్లి, కొండ్రావుపల్లిలో డీవైఎఫ్‌ఐ గ్రామ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా శ్రీను, కార్యదర్శి మహేందర్, సహాయ కార్యదర్శి ధర్మేంధర్, మంత్రాలయ్య, ఉపాధ్యక్షుడిగా నితిన్, శివాజీ, కోశాధికారి అశోక్, కమిటీ సభ్యులుగా రవివర్మ, నవీన్, సాంబ తదితరులు ఎన్నికయ్యారు.

సంఘ సేవలో భాగస్వాములవుదాం

కొల్లాపూర్: సంఘ సేవలో భాగస్వాములవుదామని కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో సంఘ సంక్షేమ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంఎస్ డబ్ల్యూ కోర్సు చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. ఎంఎస్‌డబ్ల్యూ అధ్యాపకులు వెంకటేశం, దేవరాజ్, సాయిలు పాల్గొన్నారు.

ముగిసిన మెగా నేత్ర వైద్య శిబిరం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో 10 రోజులుగా అనూష ప్రైవేటు లిమిటెడ్ అధినేత జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శంకర నేత్రాలయం చెన్నై నేతృత్వంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం మంగళవారంతో ముగిసింది. శిబిరంలో భాగంగా 182 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. 1193 మందికి స్క్రీనింగ్ టెస్టులు చేశారు. శంకర నేత్రాలయ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్, రాజు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పెద్దకొత్తపల్లి ఎంపీటీసీలు

పెద్దకొత్తపల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యావరణ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం కొల్లాపూర్ క్యాంపు కార్యాలయంలో పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన కల్వకోల్ గ్రామ 1వ ఎంపీటీసీ వెంకటస్వామి, చెన్నపురావుపల్లి ఎంపీటీసీ రామచంద్రయ్య, దేవల్ తిరుమలాపూర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డిలు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, చంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు సత్యం, చిన్నయ్య పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: గ్రామానికి ఎంపీటీసీ సుమలతశేషేంద్ర ప్రసాద్ మంగళవారం కొల్లాపూర్ క్యాంపు కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి ఎంపీటీసీ సుమలతతో పాటు ఆమె భర్త శేషేంద్రప్రసాద్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకుడు రామన్‌గౌడ్, కార్యకర్తలు ఉన్నారు.

సాయుధ రైతాంగ పోరాటంలో కీలకపాత్ర



మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కొల్లాపూర్‌లో..

నాగర్‌కర్నూల్‌రూరల్: తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు అన్నారు. మంగళవారం మల్లు స్వరాజ్యం వర్ధంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పర్వతాలు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం ఆనాడు జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 16 ఏటనే మల్లు స్వరాజ్యం ఉద్యమ బాట పట్టారని కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన మల్లు పేదల కోసం నిరంతరం శ్రమించారన్నారు. దొరలు, జమిందారులు, రజాకారుల ఆగడాలకు తమ పోరాటాల ద్వారా అడ్డుకట్ట వేశారని ప్రశంసించారు. మహిళలపై దాడులను నివారించేందుకు వారిని సంఘటితం చేసి 1980లో జరిగిన సారా వ్యతిరేక ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. రెండు పర్యాయాలు తుంగతుర్తి ఎమ్మెల్యేగా పనిచేసి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలపై ఉద్యమించారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు అశోక్, కాశన్న, మధు, సత్యనారాయణ, నర్సింహ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యురాలు మల్లు స్వరాజ్యానికి పట్టణంలో ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ఆంజనేయులు మాట్లాడుతూ వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో వీరోచిత పోరాటం చేసి భూమిలేని పేదలకు భూమి పంచడంలో ఆమె పోరాటం ఎంతో గొప్పదని ఆయన అన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, పరుషరాములు, జగన్, వెంకటయ్య, నిర్సంహ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు సలీమ్, కిరణ్‌కుమార్, వెంకటేష్, భాస్కర్, నవీన్, తారాసింగ్ న్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



అచ్చంపేట రూరల్: పురాతనమైన భ్రమరాంబ దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్లపు శ్రీనివాసులు కోరారు. మంగళవారం పట్టణంలోని భ్రమరాంబ దేవాలయంలో కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 1న ఆలయ నూతన కమిటీని ఎన్నుకోనునట్లు పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని కుల సంఘాల నాయకులు, ప్రముఖులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో , ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, కోశాధికారి భగీర్‌నాథ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం



తాడూరు: పేదలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని బలాన్‌పల్లికి చెందిన యాదగిరి అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈవిషయాన్ని గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు జయపాల్‌రెడ్డి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. ఈ మేరకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.2.50 లక్షలు బాధితుడి వైద్యం కోసం ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఈ మేరకు మంగళవారం నాగర్‌కర్నూల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎల్‌ఓసీని జయపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



అమ్రాబాద్ మండలం మందవాగుపై రక్షణ గోడలు లేని కల్వర్టు



బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లి స్టేజీ వద్ద

అమ్రాబాద్: అమ్రాబాద్ మండలంలోని వివిధ రహదారులపై నిర్మించిన కల్వర్టులపై రక్షణ గోడలు కరువయ్యాయి. కుమ్మరోనిపల్లి సమీపంలోని మందవాగు, ఈదులబావి స్టేజీ, తుర్కపల్లి, చింతలోనిపల్లి రోడ్డు, ఎల్మపల్లి, తిర్మలాపూర్(బీకే) రోడ్లపై రక్షణ గోడలు నిర్మించలేదు. కల్వర్టుల రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించ బోయి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులు కింద పడి ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కల్వర్టులపై రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

బల్మూర్: మండలంలోని నాగర్‌కర్నూల్-అచ్చంపేట ప్రధాన రహదారిలోని పోలిశెట్టిపల్లి స్టేజీ వద్ద ఉన్న కల్వర్టుపై రక్షణ గోడ లేక పోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఇదివరకే ప్రమాదాలు చోటుచేసుకున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపుల రక్షణ గోడలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బల్మూర్: మండలంలోని గోదల్ చెందిన వడ్ల లక్ష్మణాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ మాడుగుల శివాజీ, వెంకటేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ విషయాన్ని బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా రూ.5వేలు సమకూర్చారు. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దు

మన్ననూర్: ఇతర పార్టీల నుంచి వచ్చే వారిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మద్దెల దివాకర్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. దశాబ్ద కాలంగా పార్టీని నమ్ముకుని ప్రత్యేకించి బీఆర్‌ఎస్ నాయకులతో ఎన్నో ఆటు పోట్లు, అవమానాలు, కష్టాలను భరించి సైనికులుగా పని చేసి కాంగ్రెస్ గెలుపుకోసం పాటుపడ్డామన్నారు. ఇతర పార్టీల నాయకుల రాకతో మా మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ఓటమి కోసం పని చేసిన కాంగ్రెస్‌లోకి రావడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అక్రమ ఆస్తులు కాపాడుకోవడం, ప్రభుత్వం ద్వార పనుల తీసుకొని సంపాదించుకోవడం కోసం మాత్రమే పార్టీలో చేరుతున్నారని దీనిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గమనించాలని కోరారు.

వెంచర్‌లో హద్దు రాళ్ల తొలగింపు



కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కురిమిద్ద రోడ్డులో గల సాయిబాలాజీ ఫంక్షన్‌హాలు వెనకాల ఉన్న అక్రమ వెంచర్‌లో కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హద్దురాళ్లను మంగళవారం తొలగించారు. సర్వేనంబర్ 746/ఈ/1లో ఉన్న ప్లాట్ రాళ్లను తొలగించి, అదేవిధంగా ఇతర వెంచర్‌లను మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అక్రమంగా ఏర్పాటు చేసే వెంచర్‌లలో ప్రజలు ప్లాట్లు కొని మోసపోవద్దని ఆయన సూచించారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

కల్వకుర్తి: పది పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ఎంఈఓ బాసునాయక్ తెలిపారు. మంగళవారం హిందీ పరీక్షకు పట్టణంలోని 8 పరీక్షా కేంద్రాలలో కలిపి ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. 1,741 మంది విద్యార్థులకు గాను 1,733 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని వసతులు కల్పించామని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు.

కూలీలందరికీ పని కల్పించాలి



గుంతకోడూరులో మస్టర్‌లను పరిశీలిస్తున్న ఏపీఓ

పెద్దకొత్తపల్లి: కూలీలందరికీ పని కల్పించాలని ఏపీఓ మంజుల ఉపాధి సిబ్బందికి సూచించారు. మంగళవారం సాతాపూర్‌లో ఉన్న ఫీడర్‌చానల్ పనులను పరిశీలించిన అనంతరం కూలీలతో ఆమె మాట్లాడారు. ఎండతీవ్రత పెరగముందే పనులను ముగించాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. కొత్తగా పనికి వచ్చే కూలీలు జాబ్‌కార్డులు అందించాలన్నారు. మండలంలోని 25 గ్రామపంచాయతీలలో 1452 మంది కూలీలు పని చేసినట్లు ఆమె తెలిపారు. కూలీల సంఖ్య పెంచేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామాన్ని మంగళవారం ఎంపీడీఓ వెంకట్‌రాములు సందర్శించారు. ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వంశి, ఏపీఓ రాజు ఉన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు చర్లిటిక్యాల, గుంతకోడూరు, ఎంగంపల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను ఏపీఓ చంద్రసిద్దార్థ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు పనులపై అవగాహన కల్పించారు. కూలీలకు సంబంధించిన మస్టర్లను తనిఖీ చేశారు. పనుల ప్రదేశాల వద్ద కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

సారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం



యాపట్లలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కల్వకుర్తి: సారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్ల బెల్లం, సారా అమ్మినవారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గంజాయి అమ్ముతూ పట్టణానికి చెందిన యువకులు పట్టుబడ్డారని వారిపై నిఘా పెట్టామన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో తనిఖీ ముమ్మరంగా చేశామన్నారు. ఎక్సైజ్ దాడులలో పట్టుబడ్డవారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి సారా అమ్మితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పెద్దకొత్తపల్లి: యాపట్ల, చంద్రబండతండా, మారేడుమాందిన్నె తండాలలో మంగళవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి పారపోశారు. అక్రమంగా నిషేధిత బెల్లంను తయారుచేస్తున్న ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. దాడుల్లో కొల్లాపూర్ సీఐ నాగిరెడ్డి, ఎస్‌ఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుందాం



చారకొండ: వచ్చే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుందామని మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత అవసరాల కోసం కొందరు వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని అటువంటి వారికి ప్రాధాన్యత ఇవ్వొద్దన్నారు. పార్టీ గెలుపుకోసం నిరంతరం కష్టపడ్డవారిని పార్టీ గుర్తించాలని కోరారు. సమావేశంలో నాయకులు అంజయ్య, జగన్‌మోహన్, జేసీబీ వెంకటయ్య, శంకర్ గౌడ్, శ్రీనివాసులు, కొండలయ్య, లక్ష్మణ్ గౌడ్, నర్సింహ్మ చారి, భరత్ తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



ఊర్కొండ: మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఎంపీడీఓ ప్రభాకర్ ను ఎంపీపీ బక్క రాధ, మండల అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. మంగళవారం మండల కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు సంవత్సరాలుగా ఎంపీడీఓగా సేవలు అందించి ప్రజల నుంచి మన్ననలు పొందారని పలువురు అధికారులు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ నరసింహ్మ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ కలిమ్ పాషా, ఎంపీటీసీలు కలించర్ల గోపాల్ గుప్తా, ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

కొల్లాపూర్: ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం నియోజకవర్గ కేంద్రానికి చెందిన జర్నలిస్టులు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని బొంగరాలమిట్ట ప్రాంతంలో జర్నలిస్టుల కోసం జిల్లా కలెక్టర్ స్థలం కేటాయించారని వివరించారు. ఆ స్థలంలో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు రాజుగౌడ్, వినోద్, పుల్లయ్య, సురేష్, శేఖర్, కర్నె వెంకటేష్, రాయుడు, చాంద్‌పాష, ఎజాస్, కేశవులు, వెంకటేష్ చారి, వీరాచారి తదితరులు ఉన్నారు.

జర్నలిస్టులు, ఆర్టీసీ సిబ్బంది వాగ్వాదం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డు బస్టాండ్ ఆవరణలో గ్రామ పంచాయతీ కౌన్సిల్ల కిందట ప్రెస్‌క్లబ్ కోసం స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలంలో కొన్ని సంవత్సరాల కిందట ఆర్టీసీ అధికారులు టెండర్లను పిలిపించి దుకాణాల ఏర్పాటు చేసింది. ఈ విషయమై మంగళవారం జర్నలిస్టులు, ఆర్టీసీ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. స్థల వివాదంపై పలువురు స్థానికులు చర్చించుకుంటున్నారు.

అండగా ఉంటాం..



చారకొండ: మండలంలోని సారంబండ తండాకు చెందిన ఇస్లావత్ సంగ్యా ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మూడు రోజులుగా హైదరాబద్‌లోని ఓవైసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మంగళవారం ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మాజీ జెడ్పీటీసీ బీముడు నాయక్, తదితరులు ఉన్నారు.

క్విజ్ పోటీలతో జ్ఞాపకశక్తి మెరుగు



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

బల్మూర్: క్విజ్ పోటీలతో జ్ఞాపకశక్తి మెరుగు అవుతుందని, విద్యార్థుల నైపుణ్యత వెలికితీయవచ్చని కొండనాగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పరంగి రవి అన్నారు. మండలంలోని స్టూడెంట్ ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా చెంచు విద్యార్థులకు మంగళవారం కోనేరు సంస్థ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటయ్య, అశోక్, ముంతాజ్, గాయత్రి, కోనేరు సంస్థ కోఆర్డినేటర్ తిరుపతయ్య, బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి తెగుళ్ల నివారణకు చర్యలు



మన్ననూర్: వరి పంట తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈఓ సీతారాం అన్నారు. మంగళవారం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావి గ్రామంలోని రైతులు సాగు చేస్తున్న వరి పంటను రైతులతో కలిసి ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటను కాండం తొలిచే పురుగుతో పాటూ అక్కడక్కడ అగ్గి తెగులు ఆశిస్తుందన్నారు. దీని నివారణకు ట్రైసైక్లోజోన్ 120 గ్రాములు ఎకరానికి చొప్పున, కాండం తొలుచు పురుగు నివారణ కోసం ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరిన్ 400 గ్రాములు చొప్పున సాయింత్రం సమయంలో పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు బుచ్చిరెడ్డి, దామోదర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి మహిళా రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఐటీఐ కళాశాలలో మంగళవారం భగత్‌సింగ్ వర్ధంతి సభల పోస్టర్‌ను పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యా విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, సాయి, వంశీ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడాసామగ్రి అందజేస్తున్న క్లాస్‌మెట్ సభ్యులు

తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసరాఘవేందర్ జన్మదినం సందర్భంగా మంగళవారం క్రీడా సామగ్రిని అందజేశారు. అదేవిధంగా మండలంలోని యత్మాతాపూర్‌కు చెందిన రణదీర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో రూ.5 వేల విలువగల స్కూల్ బ్యాగులు, విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ దాతలు అందజేసే సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేష్, శ్రీనివాసాచారి, శ్రీనివాసులు, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరెకటికలను విస్మరించడం తగదు

అచ్చంపేట రూరల్: బీసీ కార్పొరేషన్ పదవుల కేటాయింపులలో ఆరె కటికలకు విస్మరించడం ప్రభుత్వానికి తగదని కటిక సమాజ్ అఖిల భారత కార్యదర్శి మండికారి బాలాజీ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆరెకటిక ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరె కటికలు లక్షలాదిమంది ఉన్నా గుర్తించకపోవడం బాధాకరమన్నారు. రాజకీయంగా ఎంతో చైతన్యవంతంగా ఉన్నా ఆరె కటికలకు కార్పొరేషన్లలో ఎందుకు చోటు కల్పించలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే ఆరె కటిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్ రావు, రాజారామ్, రఘు పాల్గొన్నారు.